# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-09-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రతి వ్యక్తి స్వభావంలో సేవాభావం అంతర్భాగంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**

2. **వర్ష ప్రభావిత జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**

3. **పోలీసు శాఖలో నూతనంగా ప్రవేశిస్తున్న సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు.**

4. **టెక్కలి రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున 5 లక్షల రూపాయల పరిహారం అందిస్తామని మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు.**

==========================

సేవ అనేది జీవితానికి ప్రధాన లక్ష్యం కావాలని, ప్రతి వ్యక్తి స్వభావంలో సేవాభావం అంతర్భాగంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా గుజరాత్‌లోని వాద్‌నగర్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి యాత్ర చేస్తున్న 'సేవా యాత్రికుల'తో దృశ్య మాధ్యమం విధానంలో నిర్వహించిన సమావేశంలో ప్రధానమంత్రి ఈరోజు ప్రసంగించారు. అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ, రాజకీయాల్లోనూ సేవే మార్గదర్శక సూత్రంగా ఉండాలని పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

--------------------------

వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రవణ మాధ్యమం విధానంలో అమరావతి నుంచి ఈరోజు మరోసారి సమీక్ష నిర్వహించారు. రేపు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాలతో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కొండచరియలు విరిగిపడే ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. భారీ గాలులకు రోడ్లపై పడిన చెట్లను వెంటనే తొలగించాలని, వరద పరిస్థితిని నిరంతరం అంచనా వేస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

---

తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వర్ష ప్రభావం అధికంగా ఉందని అధికారులు తెలిపారు. అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బి .ఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరడంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి, బాహుదా నదుల్లో నీటిమట్టం పెరుగుతోందని వరద ప్రవాహ ప్రాంతాల వైపు ప్రజలు వెళ్లరాదని అధికారులు విజ్ఞప్తి చేశారు.

---

తీవ్ర వాయుగుండం నేపథ్యంలో కురుస్తున్న వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 613 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు చోట్ల రహదారులు కొట్టుకుపోగా, 78 చోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయని చెప్పారు. వీటిలో 37 చోట్ల పునరుద్ధరణ పనులు చేపట్టామని, పలు ప్రాంతాల్లో రహదారులపై పడిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించామని తెలిపారు. అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు మంత్రి వివరించారు.

---

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల మున్సిపల్ కమిషనర్లతో అమరావతి నుంచి మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని, ఇంజనీరింగ్, పారిశుధ్య సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలని సూచించారు. డ్రెయిన్లలో పూడికను  ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించేందుకు మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి నారాయణ సూచించారు.

---

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'సేవా సంకల్ప అభియాన్'  ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా దేశంలో పరిసరాల పరిశుభ్రత కోసం చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం గురించి ఈ రోజు తెలుసుకుందాం.

2014లో ప్రారంభమైన స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా పారిశుధ్యం, సౌచాలయాల నిర్మాణంపై పెద్ద ఎత్తున దృష్టి సారించారు. 2014 అక్టోబర్ 2న ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. సౌచాలయాల నిర్మాణంతో పాటు పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహనను ప్రోత్సహించారు. 2024లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, పారిశుధ్యం మెరుగుపడిన ప్రాంతాల్లో శిశు, ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటులో తగ్గుదల నమోదవటం విశేషం. స్వచ్ఛ భారత్ మిషన్

ద్వారా పరిశుభ్రత, పారిశుధ్యం, ఆరోగ్యం, గౌరవం వంటి అంశాలపై దేశవ్యాప్తంగా అవగాహన పెంచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక సందర్భంలో తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

--------------------------

పోలీసు శాఖలో నూతనంగా ప్రవేశిస్తున్న మహిళా కానిస్టేబుల్స్ అంకిత భావంతో విధులు నిర్వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు. ప్రకాశంజిల్లా ఒంగోలులోని పోలీసు శిక్షణా కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న సివిల్ మహిళా కానిస్టేబుల్స్ పాసింగ్ అవుట్ పరేడ్‌ను ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి మంత్రి పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

--------------------------

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలస రైలు ప్రమాదంలో మృతిచెందిన యువకుల కుటుంబాలను వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైలు ప్రమాదంలో యువకులు మృతిచెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

--------------------------

విజయనగరంలోని భోగాపురం అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం నుంచి ఢిల్లీకి ఆకాశ ఎయిర్ నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించనుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. అక్టోబర్ 25వ తేదీ నుంచి ఈ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసుతో ఉత్తరాంధ్ర ప్రజలకు ఢిల్లీ ప్రయాణం మరింత సులభతరం అవుతుందని మంత్రి తెలిపారు.

--------------------------

విద్యార్థి దశ నుండే సమాజ సేవ పట్ల ఆసక్తి కలిగించే ఉద్దేశ్యంతో ఈరోజు జాతీయ సేవా పథకం – ఎన్.ఎస్.ఎస్ అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడానికి, క్రమశిక్షణ అలవరచుకోవడానికి దోహదం చేసే ఈ కార్యక్రమం 1969 సెప్టెంబర్ 24వ తేదీన మహాత్మా గాంధీ శతాబ్ది జయంతి ఉత్సవాల సంవత్సరం సందర్భంగా ప్రారంభమైంది. కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది.

======================